దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

నిజాంపేట్: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు గ్రాట్యుటీ, పింఛన్ సౌకర్యం కల్పించాలి సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 16న తలపెట్టనున్న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో దేశ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. నిత్యావసరాలు విపరీతంగా పెరగడంతో సామాన్యుడి జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలతో పాటు పింఛన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎల్లమ్మ, నాయకులు పూర్ణ, స్వామి, వెంకటన్న, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కట్ట మైసమ్మ జాతర


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సుభాష్‌నగర్: సూరారం కట్ట మైసమ్మ జాతరలో భాగంగా భక్తుల పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. సాయంత్రం వేళలో ఆలయ ప్రాంగణం వద్ద వెలిసిన దుకాణాల వద్ద భక్తులతో సందడి నెలకొంది. గురువారం 11 గంటలకు అమ్మవారి ఒడిబియ్యంతో అన్న ప్రసాదం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కుత్బుల్లాపూర్: మహిళల రక్షణకు అనేక చట్టాలున్నా గృహహింస, లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ సంధ్య అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో పీవోడబ్ల్యూ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సంధ్య మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనంపై సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అమలు మాత్రం నోచుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అసంఘటిక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు, మహిళలపై జరుగుతున్న దారుణాలను అరికట్టేందుకు పీఓడబ్ల్యూ సమిష్టి కార్యచరణతో ఉద్యమాలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు అనురాధ, పద్మ, సరళ, భారతి, జయసుధ తదితరలు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి


పూజల్లో ఎమ్మెల్యేలు వివేకానంద్, కృష్ణారావు, గాంధీ


జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర వేడుకలకు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీలు మంగళవారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగద్గిరిగుట్ట ప్రాంతంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి మహిమలు అపురూపమని అన్నారు. 53 సంవత్సరాలుగా నిర్విరామంగా కొనసాగుతున్న జాతరను ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సీనియర్ నాయకులు భద్రారెడ్డి, కార్పొరేటర్ జగన్, దేవాలయ చైర్మన్ వేణుయాదవ్, నాయకులు రుద్ర అశోక్, ఎత్తరి మారయ్య, వెంకటేశ్, బాబుగౌడ్, మనోజ్, గుబ్బల లక్ష్మినారాయణ, సయ్యద్ సాజిద్, పాపిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై 'పశు సంవర్ధక శాఖ' వినతి

హిమాయత్‌నగర్: రాష్ట్ర పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం(టీఈఏ) వెటర్నరీ, యానిమల్ హస్బెండరీ నూతన కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ కార్యాయంలో ప్రతినిధులు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం టీఈఏ కేంద్ర సంఘం అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల మాట్లాడుతూ.. పశు సంవర్ధక శాఖలోని ఉద్యోగుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జీఓ 317 ప్రకారం బాధిత ఉద్యోగులకు డిప్యుటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరామని తెలిపారు. వీఏ నుంచి ఎల్‌ఎస్‌ఏ ప్రమోషన్లు త్వరగా ఇవ్వాలని కోరామన్నారు. నిబంధనలకు అనుకూలంగా ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీఈఏ రాష్ట్ర కార్యదర్శి యాకుబ్ పాషా, నూతన ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.రాజు, మహిళ అధ్యక్షురాలు డాక్టర్ పి.వసంతకుమారి, చీఫ్ అడ్వైజర్ ఎ.కురుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి పి.కనకరాజు, కోశాధికారి ఎం.రామచంద్రం, కార్యవర్గ సభ్యులు ఎం.ప్రతాప్, ఎ.తిరుపతాచారి, ఎ.సైదులు, ఎం.బాబయ్య, కె.అశ్విని, బి.వనజ వల్లి, ఎల్.జానకి బాయి, ఎం.ఎ.ఖయ్యుం పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీల అందజేత

నిజాంపేట్:జన్మదినాల పేరిట వృథా ఖర్చులు చేయకుండా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించాలని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన మేడా శ్రీనివాసరావు మంగళవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డిలు వాటిని పిల్లలకు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని కోరారు.


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, మేడా శ్రీనివాస్‌రావు

ఫైనల్ ప్రిపరేషన్

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కసరత్తు
- ప్రీ ఫైనల్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- ఫైనల్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా బోధన


పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

దుండిగల్: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కసరత్తు పూర్తి చేశారు. పరీక్షలకు నెల రోజులు మాత్రమే ఉండడంతో ప్రతి రోజు స్లిప్ టెస్టలను నిర్వహిస్తున్నారు. అదే విధంగా మెయిన్ పరీక్షతో పాటు ప్రీ ఫైనల్స్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ.. విద్యార్థులను గ్రూపులుగా విభజించి ఒకరికొకరు అప్పజెప్పుకోవడం.. పాఠ్యాంశాల్లో ఉన్న ప్రతి అంశం విద్యార్థికి ఏ మేర బోధపడుతుందో తెలుసుకునేందుకు ప్రతి నిత్యం స్లిప్ టెస్టలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని దుండిగల్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల్లోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో 17,084 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. మార్చి 8వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

సీసీఈ విధానం అమలు..

2014–15 విద్యా సంవత్సరంలో విద్యార్థులు బట్టీ విధానానికి పూర్తిగా స్వస్తి పలకడమే ధ్యేయంగా రాష్ట్ర విద్యాశాఖ నిరంతర సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో విద్యార్థులు సబ్జెక్టులో ఉన్న ప్రశ్న, జవాబులను మాత్రమే చదువుతూ బట్టీ పట్టేవారు. కానీ ఈ విధానం కారణంగా ఉపాధ్యాయులు పాఠాలను చెప్పే సమయంలోనే విద్యార్థులకు ఎంత మేర పాఠ్యాంశం అర్థమైతుందో తెలుసుకునేందుకు వారితోనే స్వయంగా ప్రశ్నలు రూపొందించి జవాబులు రాయిస్తారు.


బౌరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

దీంతో సదరు పాఠంపై విద్యార్థులకు పూర్తిగా అవగాహన రావడంతో పాటు పరీక్షల సమయంలో ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా జవాబు రాసే విధంగా విద్యార్థులకు తర్ఫీదును ఇస్తున్నారు. మొదట్లో ఈ విధానం పట్ల విద్యార్థులు కొంత తడబడిన క్రమేణ పుంజుకున్నారు.

40 రోజుల పాటు ప్రణాళిక..

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయులు పక్కా ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగానే 40రోజుల పాటు ప్రణాళికను ఏర్పాటు చేశారు. ముందుగా సిలబస్ మొత్తం పూర్తి చేసి ప్రతిరోజు అన్ని సబ్జెక్టుల్లో ఒక్కో పాఠాన్ని బోధిస్తూ రోజుకు ఒక సబ్జెక్టును ఎంచుకొని స్లిప్ టెస్టలు నిర్వహించారు. దీనికి తోడు ప్రత్యేకంగా స్పెషల్ టెస్టులను సైతం నిర్వహించి విద్యార్థి ప్రతిభను అంచనా వేస్తారు. ఆయా సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సాయంత్రం అదనంగా రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. దీనికి తోడు తల్లిదండ్రులతో నిత్యం సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల పని తీరును వారికి వివరిస్తున్నారు.

క్రమంగా పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతంలో పోలిస్తే ఈ దఫా శాతాన్ని పెంచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. 2015–16లో 53, 16–17లో 61, 17–18లో 65, 18–19లో 78 శాతం సాధించారు. కరోనా కారణంగా రెండేళ్ల అనంతరం 2021–22లో 66, 22–23లో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యా సంవత్సరం 90 శాతం లక్ష్యాన్ని పెట్టుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధన..



ముందుగా అనుకున్న సమయానికి సిలబస్ పూర్తి చేశాం. అనంతరం 40 రోజుల పాటు ప్రణాళిక రూపొందించుకుని రివిజన్ చేయిస్తున్నాం. ప్రతి రోజు ఒక్కో సబ్జెక్ట్‌పై స్లిప్ టెస్టులను నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి కోసం అదనంగా తరగతులను నిర్వహిస్తున్నాం.

– ఎస్.రాంరెడ్డి, బౌరంపేట పాఠశాల హెచ్‌ఎం

ఏడు ప్రశ్న పత్రాలే ఉంటాయి



గతంలో ఆరు సబ్జెక్టులకు రెండవ లాంగ్వేజ్ మినహా అన్ని సబ్జెక్ట్‌లకు రెండేసి పేపర్లు మొత్తం 11 పత్రాలు ఉండేవి. కానీ కరోనా అప్పటి నుంచి వాటిని ఏడు పేపర్లకు కుదించారు. అన్ని సబ్జెక్ట్‌లకు ఒక్కో పేపర్ ప్రశ్నా ప్రతాలే ఉండగా సైన్స్‌లో మాత్రం ఫిజిక్స్, బయాలజీలకు రెండు పేపర్లు ఉంటాయి. ఇప్పటికే విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధిస్తాం.

– ఆంజనేయులు, మండల విద్యాధికారి


గండిమైసమ్మ నుంచి నల్లగొండ సభకు తరలి వెళ్తున్న దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు


కుత్బుల్లాపూర్‌లో మాజీ కార్పొరేటర్ గౌరీష్ అధ్వర్యంలో సభకు తరలి వెళ్తూ..

నల్లగొండకు గులాబీ దళం

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నల్లగొండలో పోరు గర్జన సభ జరిగింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు బస్సులు, కార్లలో నల్లగొండ సభకు వెళ్లారు. – కుత్బుల్లాపూర్


నిజాంపేట్‌ను సభకు తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కార్యకర్తలతో కలిసి బస్సులో సభకు వెళ్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ


వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

నిజాంపేట్: కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం అభినందనీయమని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ఆస్పత్రి చైర్మన్ భద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరంలో పరీక్షలు చేయించుకోగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, చిట్ల దివాకర్, కోలన్ వీరేందర్‌రెడ్డి, స్థానిక బస్తీ నాయకులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం మేయర్ నీలారెడ్డి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, పార్కు అభివృద్ధి పనుల విషయమై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వర్షాకాలంలోపు అభివృద్ధి పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న మేయర్ నీలారెడ్డి

ఎట్టకేలకు స్పందించిన అధికారులు


అధికారులు పాక్షికంగా కూల్చివేసిన గోడ



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

జీడిమెట్ల: 'నాలా స్థలాల ఆక్రమణలు' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కుత్బుల్లాపూర్ టౌన్ అధికారులు స్పందించారు. సుభాష్‌నగర్ డివిజన్ గంపలబస్తీలో ఓ వ్యక్తి ప్లాట్ నెంబర్ 47లో నాలాను కొంతమేర అక్రమించి నిర్మాణం చేపట్టాడు. దీనికి తోడు వేర్వేరు ప్లాట్లలో నిర్మాణానికి అనుమతులు తీసుకుని రెండు ప్లాట్లను కడుతూ నిర్మాణం చేపట్టాడు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో అధికారులు మంగళవారం నాలా స్థలానికి ఆనుకుని ఉన్న మూల వద్ద గోడను పాక్షికంగా కూల్చివేశారు. సదరు నిర్మాణం చేపట్టే చోటా వాచ్‌మెన్ తప్పా ఎవరూ లేకపోవడంతో అధికారులు షోకాజు నోటీసు అతికించారు. వెంటనే స్పందించకపోతే నిర్మాణాన్ని కూల్చివేయాల్సి ఉంటుందని అధికారులు అన్నారు. మరి నాలా స్థలంలో బిల్డింగ్ కోసం వేసిన పిల్లర్‌ను అధికారులు ఏవిధంగా తొలగిస్తారో చూద్దాం.

'ఆరు గ్యారంటీలు అమలవుతాయి'

జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌడ ఐలయ్యగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట విద్యుత్ ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న గృహజ్యోతి పథక దరఖాస్తుదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల్లో రెండు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. మిగిలిన పథకాలను త్వరలోనే వర్తింపజేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, గూడ పాయిప్రవీణ్‌గౌడ్, వాంబే మరళి, మంగ, సులోచన, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న గూడ ఐలయ్య

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచి నిర్వహించిన అభిషేకాలు, కుంకుమర్చనల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎల్‌వీ ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటా

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి సమస్యలను నివేదించారు. తమ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.


సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

బండారి లేఅవుట్‌లో బెంచీల ఏర్పాటు

నిజాంపేట్: లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని బండారి లేఅవుట్‌లో బెంచీలు ఏర్పాటు చేశారు. బండారి లేవుట్ 9–బీ పార్క్ బ్యాక్ గేట్ సమీపంలో, రోడ్డు నం.10లో స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు చెత్తా చెదారం వేస్తుండటంతో దుర్గంధ భరితంగా మారుతోంది. దీంతో చెత్త వేయకుండా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంచీలు ఏర్పాటు చేశారు. ఫౌండర్ చైర్మన్ భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. పార్కు వచ్చే వారు చెత్తాచెదారాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చెత్త వేయకుండా బెంచీలు ఏర్పాటు చేశామని తెలిపారు. బెంచీల ఏర్పాటుకు సహాయం అందజేసిన ధనంజయ్, కృష్ణచైతన్యలకు లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు

నిజాంపేట్: జేఈఈ మెయిన్స్‌లో బాచుపల్లి వికాస్ ద కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. విద్యార్థులు అరుణ్ అయ్యప్పన్ (99.95), కమలేష్ (99.49), ఆదిసత్య (99.09), ఆదిత్య (98.90), అర్పిసింగ్ (98.79), వంశీకృష్ణ (98.38), అబ్దుల్ ముఖీత్ (98.22), సాయిసాతియన్ (95.27), కర్నిమిశ్రీ (95.27), పవిత్రజైన్ (93) శాతం మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

రేపు ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

సుభాష్‌నగర్: సుచిత్రలోని 44వ జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం గురువారం జరగనుందని ఆలయ కమిటీ పేర్కొంది. ఉదయం 6 గంటలకు అభిషేకం, 10.30 గంటలకు లగ్నము అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్–4ఏ సర్వీస్ రోడ్డు గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. అనారోగ్యం కారణంగానే అతను చనిపోయి ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రేణుకాఎల్లమ్మకు మొక్కుల చెల్లింపు

నిజాంపేట్: బాచుపల్లి ఎస్‌జేబీహిల్స్‌లో కొలువుదీరిన రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


రేణుక ఎలమ్మను దర్శించుకున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

గొడుగు.. నీడనిచ్చు..

వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేణ పెరుగుతూ వస్తున్నాయి. వేసవికాలం ప్రారంభం కాకముందే ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం వేళ ఎండ నుంచి తట్టుకోవడానికి చాలామంది గొడుగులు వాడుతున్నారు. షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో గొడుగు నీడన వెళ్తున్న బాలుడుని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సుభాష్‌నగర్

